సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం : 18 : జూలై : 2025



వర్షాభావంతో ఆందోళన

జిల్లాలో లోటు వర్షపాతం నమోదు కాగా, పత్తి మొక్కలు, వరి నార్లు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో



తేలని పోడు పోరు

కారేపల్లి మండలంలో పోడు భూముల వివాదం తేలక పోడుదారులు – అటవీ ఉద్యోగుల నడుమ తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
33°/ 25°

జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సుమనోహరం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం సుమనోహరంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం నివేదన, హారతి సమర్పించి, మంత్రపుష్పం పఠించారు. కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ, ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, పెద్దమ్మతల్లిని ఈనెల 20న శాకాంబరీ రూపంలో అలంకరించనున్నట్లు ఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

కంప్యూటర్ విద్యపై పట్టు సాధించాలి

- డీఈఓ వెంకటేశ్వరా చారి



కంప్యూటర్ ప్రయోగశాలను పరిశీలిస్తున్న డీఈఓ తదితరులు

మణుగూరు రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు కంప్యూటర్ విద్యపైనా పట్టు సాధించాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరా చారి అన్నారు. మణుగూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ప్రయోగశాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీవితంలో ఎదిగేందుకు విద్య గొప్ప ఆయుధంలా దోహదపడుతుందని అన్నారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఎంఓ సైదులు, ఏఎంఓ నాగరాజశేఖర్, ఎంఈఓ జి.స్వర్ణజ్యోతి, సాంబాయిగూడెం కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎం.శ్రీలత, ఎమ్మార్పీలు ఎం.విష్ణు, పి.బాలరాజు, పి.రామకృష్ణ, కె.రాంబాబు, ఐ.బాలాజీ, ఐ.రమేష్, టి. శ్రీకాంత్, హెచ్‌ఎం బ్రహ్మయ్య, బి.విజయ, ఏపీసీ చైర్మన్ ఉత్తమ కుమారి పాల్గొన్నారు.

నానో యూరియానే వినియోగించాలి



రైతులతో మాట్లాడుతున్న బాబూరావు

బూర్గంపాడు: రైతులు గుళికల యూరియా స్థానంలో ద్రవ రూపంలో ఉండే నానో యూరియా వినియోగాన్ని పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు సూచించారు. బూర్గంపాడు పీఏసీఎస్‌లో యూరియా విక్రయాలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నానో యూరియాతో అనేక ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. గుళికల యూరియా కంటే బాగా పనిచేస్తుందని, పంటల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. నానో యూరియాతో భూగర్భ జలాల్లోకి నత్రజని చేరదని, తద్వారా భూసారం బాగుంటుందని అన్నారు. అర లీటర్ నానో యూరియా ఒక బస్తా యూరియాతో సమానమన్నారు. ఇది రవాణాకు కూడా తేలికగా ఉంటుందని, కూలీల ఖర్చు తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏఓ శంకర్ పాల్గొన్నారు.

మంత్రులకే మోడల్



ప్రభుత్వ ఖర్చుతో ఉచితంగా సోలార్ యూనిట్లు

- మోడల్ విలేజ్ పథకంలో ఏజెన్సీ జిల్లాపై వివక్ష
- తొలి దశలో మంత్రుల నియోజకవర్గాల్లోని గ్రామాలకే చోటు
- ఉమ్మడి జిల్లాకు 28.. భద్రాద్రికి దక్కింది ఒక్కటే

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయి. భారీగా సబ్సిడీలు అందిస్తున్నాయి. అయినా ఆశించిన స్థాయిలో సౌర విద్యుత్ యూనిట్ల స్థాపనకు ప్రజల నుంచి స్పందన రావడం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మోడల్ సోలార్ విలేజ్ పేరుతో ఎంపిక చేసింది. ఆయా గ్రామాల్లో గృహ, వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా ప్రతీ ఇంటికి సోలార్ యూనిట్లను సర్కారు ఖర్చుతో ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 80 గ్రామాలను ఎంపిక చేయగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 28 ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో ఇంటికైతే 2 కిలోవాట్స్, వ్యవసాయ మోటార్లకు 7.50 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ యూనిట్లను లబ్ధిదారులకు అందించనుంది.

అన్నీ ఖమ్మం జిల్లాకే..

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో 28 గ్రామాలను మోడల్ సోలార్ విలేజ్ పథకానికి ఎంపిక చేశారు. ఇందులో 27 గ్రామాలు ఖమ్మం జిల్లా పరిధిలో ఉండగా, భద్రాద్రి జిల్లాలో ఒకే ఒక్కటి ఉండడం గమనార్హం. ఖమ్మం జిల్లాలో ఎంపికైన 27 గ్రామాల్లో 22 బోనకల్ మండలంలోనే ఉన్నాయి. ఈ మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో గృహ, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సోలార్ యూనిట్లు ఉచితంగా ఏర్పాటుచేయనున్నారు. ఇక మధిర మండలం సిరిపురం, పాలేరు నియోజకవర్గంలోని చెరువుమాధారం, ఖమ్మం నియోజకవర్గంలో రఘునాథపాలెం, వైరా నియోజకవర్గంలో స్నానాల లక్ష్మీపురం, శ్రీరామగిరి గ్రామాలు ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామానికి మాత్రమే అవకాశం దక్కింది.

ఏజెన్సీ జిల్లాపై పట్టింపేది ?

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో పది అసెంబ్లీ స్థానాలకు గాను ఖమ్మంలో ఐదు, భద్రాద్రిలో ఐదు ఉన్నాయి. ముఖ్యంగా భద్రాద్రి జిల్లాలో ఏజెన్సీ ప్రాంతమే ఎక్కువ. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన గిరిజన గ్రామాలు, ఆ సామాజిక వర్గ జనాభానే అధికంగా ఉన్నారు. ప్రభుత్వం తరఫున అమలయ్యే ప్రోత్సాహకాలు, సంక్షేమ పథకాల్లో ఈ జిల్లాకు కచ్చితంగా చోటు కల్పించాలి. కానీ అందుకు భిన్నంగా ఖమ్మం జిల్లాకే, అందులోనూ మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకే అన్ని పథకాల్లో ప్రాధాన్యత దక్కుతుండటం విమర్శలకు తావిస్తోంది. మోడల్ సోలార్ విలేజ్ పథకంలో ఇల్లెందు, భద్రాచలం, పినపాక, కొత్తగూడెం, సత్తుపల్లి నియోజకవర్గాల నుంచి ఒక్క గ్రామాన్ని కూడా చేర్చకపోవడాన్ని పలువురు తప్పు పడుతున్నారు.

మంత్రులకే పెద్దపీట..

మోడల్ సోలార్ విలేజ్ పథకానికి ఎంపికైన గ్రామాలను పరిశీలిస్తే మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలు, వారి సొంత గ్రామాలకే చోటుదక్కింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న బోనకల్ మండలంలో 22 గ్రామాలు, మధిర మండలం సిరిపురం ఈ పథకం పరిధిలోకి వచ్చాయి. ఆయన సొంతూరైన వైరా నియోజకవర్గంలోని లక్ష్మీపురంతో పాటు శ్రీరామగిరి కూడా ఉన్నాయి. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహించే నేలకొండపల్లి మండలం చెరువుమాధారం, తుమ్మల నాగేశ్వరరావు ప్రాతనిధ్యం వహిస్తున్న రఘునాథపాలెంతో పాటు ఆయన సొంతూరైన గండుగులపల్లికి అవకాశం దక్కింది. తుమ్మల సొంతూరు భద్రాద్రి జిల్లా కాకుంటే ఆ ఒక్క గ్రామానికి కూడా చోటు లభించేది కాదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కలెక్టర్‌కు అవార్డులు



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఐఐటీ బాంబేలో నిర్వహించిన ఓపెన్ సోర్స్ డేలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ నేషనల్ జియో స్పేషియల్ ప్రాక్టీషనర్ అవార్డుతో పాటు ఓపెన్ సోర్స్ జీఐఎస్ కోహార్ట్ అవార్డులను గురువారం ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ మాజీ చైర్మన్ ఏ.ఎస్.కిరణ్‌కుమార్ చేతులమీదుగా అందుకున్నారు. జిల్లాలో గ్రామీణ సమస్యల పరిష్కారం కోసం జియో స్పేషియల్ టెక్నాలజీ నిపుణులతో నిర్వహించిన మొదటి ఓపెన్ సోర్స్ జీఐఎస్ సదస్సు నిర్వహణకు, జిల్లా సమస్యలను లోకల్ స్థాయిలో పరిష్కరించేలా చేసినందుకు ఈ అవార్డులు దక్కాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఐఐటీ బాంబే సాంకేతిక పరిజ్ఞానాన్ని జిల్లాకు తీసుకొచ్చి రైతులు, విద్యార్థులు, అధికారులు అందరికీ ఉపయోగపడేలా చేస్తున్నట్లు వివరించారు. అందులో భాగంగానే జీఐఎస్ సాయంతో పత్తి, మొక్కజొన్న పొలాలను మ్యాప్ చేసి రైతులను మునగసాగు వైపు మళ్లించే ప్రయత్నం మొదలు పెట్టామని, మేకల పెంపకం, మేకపాల ఉత్పత్తి పెంపుదలపై పరిశీలనలు జరుగుతున్నాయని వివరించారు. ఈ అవార్డులు జిల్లాకు గర్వకారణమని వ్యాఖ్యానించారు.

కేసుల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

కొత్తగూడెంటౌన్ : జిల్లాలో పెండింగ్ కేసుల పరిష్కారానికి 90 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్, కార్యదర్శి ఎం.రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 30 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకోవచ్చని, తద్వారా కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతాయని వివరించారు. వివాహ సంబంధ వివాదాలతో పాటు ప్రమాదాలు, గృహ హింస, చెక్ బౌన్స్, సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వీరబాబు

కొత్తగూడెంఅర్బన్ : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కాంగ్రెస్ నాయకుడు పసుపులేటి వీరబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని లైబ్రరీలను త్వరలో పరిశీలిస్తానని, గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమని, వాటిని ఆదర్శంగా నిలుపుతామని చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు, పాఠకులకు అనుకూల వాతావరణం కల్పించాలన్నారు. అంతకుముందు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కరుణకుమారి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జి.మణిమృదుల, ఆఫీస్ ఇన్‌చార్జ్ ఎం.నవీన్‌కుమార్, నాగన్న, మధుబాబు, నాయకులు పల్లె వరప్రసాద్, జల్లారపు ఈశ్వర్, బండి శ్రీకాంత్‌గౌడ్, లావుడియా నరేష్ పాల్గొన్నారు.

కరకగూడెంలో నేడు కేటీఆర్ పర్యటన

కరకగూడెం: మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం కరకగూడెం మండలంలో పర్యటించనున్నారు. మొదట ఖమ్మం కవిరాజ్‌నగర్‌లో ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ కుటుంబాన్ని పరామర్శిస్తారు. ఆ తర్వాత మండలంలోని సమత్ భట్టుపల్లి చేరుకుని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును పరామర్శించనున్నారు. కాంతారావు తల్లి ఇటీవల మృతి చెందగా, ఆమెకు నివాళులర్పించాక హైదరాబాద్ బయలుదేరతారు. కాగా, భట్టుపల్లిలో హెలీపాడ్ ప్రాంతాన్ని రేగా కాంతారావు, ఆర్‌అండ్‌బీ డీఈ సతీష్, ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు.

మహిళల అభివృద్ధే లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన మరో మంత్రి ధనసరి సీతక్క, ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు

ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ ఇళ్లు..

- కోటి మంది నారీమణులను కోటీశ్వరులను చేస్తాం
- మంత్రులు పొంగులేటి, సీతక్క
- ఇల్లెందులో ఘనంగా మహిళా శక్తి సంబురాలు



మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు కోరం, తెల్లం వెంకట్రావు, పక్కన ఐటీడీఏ పీఓ రాహుల్

ఇల్లెందు : మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ పేదవాడికీ ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. ఇల్లెందులోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన ఇందిరమ్మ మహిళా శక్తి సంబరాల కార్యక్రమానికి మంత్రి ధనసరి సీతక్కతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలకు 18 నెలల్లో రూ.856 కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. అధికారంలోకి వచ్చిన 24 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామని, ఇప్పుడు వారిని బస్సులకు యజమానులుగా చేస్తున్నామని చెప్పారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, నెలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించిన చరిత్ర ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. ఇప్పటికే 60 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించామని, త్వరలో మరో 40 వేల ఉద్యోగాలు అందిస్తామని అన్నారు. ఇన్ని పథకాలు అమలు చేసిన కాంగ్రెస్ పార్టీని వచ్చే స్థానిక ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు.

పురుషులపై ఆధారపడకుండా..

మహిళలు పురుషులపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదగాలనే లక్ష్యంతో ఇందిరమ్మ రాజ్యం పని చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని, ఆ దిశగా మహిళామణుల కోసం సెర్ప్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం మహిళల ఆర్థిక స్వావలంబనకు మార్గంగా మారుతుందని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందుతుండడంతో సభ్యుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని చెప్పారు. ఒకప్పుడు ఏ పని చేయాలన్నా వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చేదని, ఇప్పుడు మహిళలకు ప్రభుత్వమే ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు. అనంతరం మహిళలకు ఇందిరమ్మ ఇంటి మంజూరుపత్రాలతో పాటు వడ్డీ లేని రుణాలు, బీమా, బ్యాంక్ లింకేజీ తదితర రూ.34 కోట్ల చెక్కులను మంత్రులు పొంగులేటి, సీతక్క అందజేశారు. కార్యక్రమంలో ఇల్లెందు, భద్రాచలం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, ఐటీడీఏ పీఓ రాహుల్, ఎస్పీ రోహిత్ రాజ్, మహబూబాబాద్ ఆర్డీఓ మధుసూదన్‌రాజ్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, తహసీల్దార్ రవి, ఎంపీడీఓ ధన్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, డీఎస్ఓ రుక్మిణీ, సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రణాళికలు



విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

పాల్వంచ: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చదువుతో పాటు వివిధ క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. గురువారం స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో టేబుల్ టెన్నిస్ క్రీడలను శిక్షణ కలెక్టర్ సౌరభ్‌శర్మతో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు వ్యాసరచన, ఉపన్యాసం పోటీలతో పాటు కుట్టడం, అల్లికలు, కరాటే తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఐదు పాఠశాలల్లో హాకీ, హ్యాండ్‌బాల్, బాల్ బాడ్మింటన్, రెజ్లింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈమేరకు విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఓ చంద్రమోహన్, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, అసిస్టెంట్ స్పోర్ట్స్ అధికారి వెంకటనారాయణ, హెచ్‌ఎం భద్రం, వార్డెన్ పవన్, గోపాలరావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిండని తుమ్మలచెరువు

- ఆయకట్టులో ప్రశ్నార్థకంగా మారిన వరిసాగు
- సీతారామ జలాలు ఇవ్వాలని కోరుతున్న రైతులు



తుమ్మలచెరువు ఆయకట్టు మల్లెలమడుగులో రైతులు పోసిన వరినారు

అశ్వాపురం: కాకతీయులకాలం నాటి తుమ్మల చెరువు ఆయకట్టులో ఖరీఫ్ వరిసాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో చెరువులో ఇంకా నీరు చేరలేదు. ఆయకట్టులో పోసిన వరినార్లు ఎండిపోతున్నాయి. దీంతో సుమారు 10 వేల మంది రైతులు, వేలాది మంది రైతు కూలీలు ఆందోళన చెందుతున్నారు.

ముందుకు సాగని మారెళ్లపాడు లిఫ్ట్ పనులు

సీతారామ ప్రాజెక్ట్ ద్వారా తుమ్మలచెరువుకు నీరు అందించేందుకు బీజీ కొత్తూరు పంప్‌హౌస్ సమీపంలో మారెళ్లపాడు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. రెండేళ్లు గడిచినా పనులు ముందుకు సాగడం లేదు. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పనులను సందర్శించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కాగా ఈ ఖరీఫ్‌కు దీనిద్వారా నీరు ఇవ్వడం సాధ్యం కాదు. తుమ్మలచెరువుకు మూడు కాలువలు ఊరవాయి, కుందారం, చదలవాడ కాలువలు ఉన్నాయి. ఇవి సీతారామకాలువ సమీపంలోనే ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీతారామ ప్రధాన కాలువకు అనువైన ప్రదేశంలో గేట్‌వాల్వ్ ఏర్పాటు చేసి, మోటార్లు, పైపుల ద్వారా తాత్కాలికంగా చెరువు కాలువల్లోకి నీరు ఇచ్చే అవకాశం ఉంది. స్థానిక ఎమ్మెల్యే, నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి తుమ్మలచెరువు కాలువలకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సాగు నీరు ఇవ్వాలి



చెరువు ఆయకట్టులో వరినారు పోశాం. వర్షాల్లేక నారు ఎండిపోతోంది. ఈ వానాకాలం సీజన్‌లో తుమ్మల చెరువు కింద వరిసాగు ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం స్పందించి సీతారామ నీళ్లు ఇవ్వాలి.

–కమటం వెంకటేశ్వరరావు, ఆయకట్టు రైతు, మొండికుంట

రామయ్య భూములు దక్కేనా ?

- పురుషోత్తపట్నంలో పర్యటించిన పీఠాధిపతి
- స్థానికులతో చర్చలు.. భూములు తమవేనంటున్న రైతులు
- అన్యమతస్తుల నుంచి భూమి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్
- రాముడి భూమి ఆలయానికే చెందాలన్న శ్రీనివాసానంద స్వామిజీ



పురుషోత్తపట్నం గ్రామస్తులతో మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

భద్రాచలం: భద్రాద్రి రామయ్యకు చెందిన ఏపీలోని పురుషోత్తపట్నం భూములపై రచ్చ కొనసాగుతూనే ఉంది. దేవాదాయ శాఖకు చెందిన భూములను స్వాధీనం చేయాలని ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని రామాలయ అధికారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాముడికి చెందిన భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతుండడం, వాటిని ఆలయ వర్గాలు అడ్డుకోవడంతో ఘర్షణలతో ఉద్రిక్తత నెలకొంటోంది. కాగా, ఏపీలోని ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి స్వామిజీతో పాటు బీజేపీ నాయకులు పురుషోత్తపట్నంలో గురువారం పర్యటించి గ్రామస్తులు, రైతులతో మాట్లాడారు.

అన్యమత సంస్థకు ఎలా అప్పగించారు..?

ఎన్నో ఏళ్లుగా భూములు సాగు చేసుకుంటున్న తాము రామాలయానికి కౌలు చెల్లిస్తున్నామని, రాముడిపై ఆధారపడి జీవిస్తున్న తమకు అన్యాయం చేయొద్దని స్థానిక రైతులు అన్నారు. అయితే ఆలయానికి చెందిన 12 ఎకరాల భూమిని ఉమ్మడి ఏపీలోని నాటి టీడీపీ ప్రభుత్వం ఓ అన్యమత సంస్థకు ఎలా అప్పగించిందని ప్రశ్నించారు. మొదట ఆ భూమిని స్వాధీనం చేసుకున్నాకే తమ వద్దకు రావాలని అన్నారు. రాముడికి తాము వ్యతిరేకం కాదని, అందరికీ సమన్యాయం జరగాలని, ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

భూమి రాముడికే చెందాలి..

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్న భద్రాద్రి రామయ్యకు చెందిన భూములు స్వామివారికే దక్కాలని శ్రీనివాసానంద సరస్వతి స్వామిజీ అన్నారు. పురుషోత్తపట్నంలో పర్యటన తర్వాత భద్రాచలంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇరు రాష్ట్రాలకు చెందిన సున్నితమైన అంశాన్ని శాంతియుతంగా పరిష్కరించాలని సూచించారు. ఇటు ఆలయానికి, అటు రైతులకు సమన్యాయం జరిగేలా రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు నివేదిక ఇస్తామన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి దేవాదాయ శాఖకు శాశ్వత స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. అన్యమత సంస్థకు కేటాయించిన భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని, అక్కడ నుంచే ఆక్రమణల తొలగింపును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సాధుపరిషత్ గౌరవాధ్యక్షులు అట్లూరి నారాయణరావు మాట్లాడుతూ.. రాముడికి చెందిన భూముల స్వాధీనంపై ఇరు రాష్ట్రాల సీఎంలు స్పందించకుంటే కోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఏపీ సాధు పరిషత్ గౌరవ సలహాదారు కురిచేటి రామచంద్రమూర్తి పాల్గొన్నారు. కాగా, తొలుత భద్రాచలం వచ్చిన ఈ బృందం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. పండితులు వారికి వేదాశీర్వచనం అందజేశారు.

క్లుప్తంగా

జెడ్పీని సందర్శించిన ట్రైనీ కలెక్టర్



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ గురువారం సందర్శించారు. అసిస్టెంట్ కలెక్టర్ హోదాలో వివిధ శాఖల్లో ఆరు రోజుల శిక్షణ నిమిత్తం ఆయన జిల్లా పరిషత్ పరిధిలోని వివిధ విభాగాల పని తీరు, ఇతరఅంశాలకు సంబంధించిన వివరాలను జిల్లా ప్రజా పరిషత్ సీఈవో బి. నాగలక్ష్మి, డిప్యూటీ సీఈఓ కె.చంద్రశేఖర్‌లను అడిగి తెలుసుకున్నారు. వివిధ విభాగాల ఫైళ్లను పరిశీలించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బందిని అభినందించారు.

కాలువ కట్టకు మరమ్మతులు



మట్టిపోసి చదును చేసిన కట్ట

ములకలపల్లి: కోతకు గురవుతున్న సీతారామ ఎత్తిపోతల పథకం (ఎస్ఆర్ఎల్ఐపీ) ప్రధాన కాలువ కట్టకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. మండల పరిధిలోని వీకే రామవరం శివారు పంప్‌హౌస్–2 నుంచి కమలాపురంలోని పంప్‌హౌస్–3కు వెళ్లే ప్రధాన కాలువ 51వ కిలోమీటర్ వద్ద కుడివైపున కోతకు గురైంది. వర్షాకాలం నేపథ్యంలో ప్రధాన కాలువ కట్ట తెగిపోయి సిమెంట్ లైనింగ్‌కు పగిలిపోయే ప్రమాదముంది. దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి కోతకు గురైన ప్రదేశంలో మట్టిపోసి కట్టను పటిష్టం చేశారు.

బీఎస్ఎన్ఎల్ న్యాయవాదిగా బాబూరావు



బాబూరావుకు నియామకపత్రం అందజేస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: బీఎస్ఎన్ఎల్ ఎంప్యానెల్మెంట్ న్యాయవాదిగా ఏపూరి బాబూరావు నియమితులయ్యారు. ఉమ్మడి జిల్లాలో న్యాయ సేవల కోసం బీఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఈ మేరకు నియామకం చేపట్టారు. బాబూరావుకు గురువారం జిల్లా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుభాష్ నియామక పత్రాన్ని అందజేశారు. బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజనీర్ సత్రు, జూనియర్ టెలికాం ఆఫీసర్ సందీప్, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శివరాంజి పాల్గొన్నారు.

రేపు ద్రాక్షారామంలో రామయ్య కల్యాణం

భద్రాచలం: ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా ద్రాక్షారామంలో ఈ నెల 19న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కడి బాల భక్తసమాజం అభ్యర్థనతో దేవస్థానం ప్రచార రథాన్ని పంపి, ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో వేడుక జరుపనున్నట్లు పేర్కొన్నారు.

వెలిసిన మావోయిస్టు వ్యతిరేక పోస్టర్లు

సుజాతనగర్: మండల పరిధిలోని స్టేషన్ బేతంపూడిలో గురువారం మావోయిస్టు వ్యతిరేక పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టు ఆత్మ పరిరక్షణ ప్రజాఫ్రంట్ పేరుతో వాల్ పోస్టర్లను గ్రామంలో అక్కడక్కడా అంటించారు. మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని పోస్టర్లలో పేర్కొన్నారు.

ఇసుక నిల్వలు సీజ్

ములకలపల్లి: మండలంలోని వీకే. రామవరం, ఒడ్డు రామవరం, సంజీవ్‌పల్లి శివార్లలో అక్రమంగా నిల్వ చేసిన నాలుగు లారీల ఇసుకను గురువారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఇసుకను స్వాధీనం చేసుకుని తహసీల్‌కు తరలించినట్లు తహసీల్దార్ భూక్యా గన్యా తెలిపారు.

మందుపాతరలు నిర్వీర్యం

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు బీరు బాటిళ్లలో ఏర్పాటు చేసిన రెండు మందుపాతరలను భద్రతా బలగాలు గురువారం గుర్తించి నిర్వీర్యంచేశారు. ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధి టేకుమెట్ల అటవీ ప్రాంతానికి వెళ్తున్న సీఆర్‌పీఎఫ్ 196 బెటాలియన్‌కు చెందిన బలగాలు మందుపాతరలను గుర్తించారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి, అక్కడే నిర్వీర్యం చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

వర్షాభావంతో ఆందోళన



పాల్వంచ మండలం నాగారం కాలనీలో వాడిపోతున్న పత్తి మొక్కలు

వానల కోసం రైతుల ఎదురుచూపులు

- 12 మండలాల్లో లోటు వర్షపాతం నమోదు
- తొమ్మిదింటిలో సాధారణం, రెండింటిలో అధికం
- గురువారం రాత్రి కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం

సూపర్‌బజార్(కొత్తగూడెం): లోటు వర్షపాతంతో పంటలు మాడిపోతున్నాయి. ఇప్పటికే పత్తి మొక్కలు వాడిపోతున్నాయి. వరినార్లు ఎండిపోతున్నాయి. వర్షాభావ పరిస్థితులు వానాకాలం సాగుపై ప్రభావం చూపుతున్నాయి. జిల్లాలో జూన్‌లో లోటు వర్షపాతం నమోదుకాగా రైతులు ఆందోళన చెందారు. ఈ నెల ప్రారంభంలో కురిసిన వర్షాలతో లోటు వర్షపాతం కాస్తా అధికవర్షపాతంగా నమోదైంది. రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. ఈ నెల 3వ తేదీ వరకు రైతులను మురిపించిన వర్షం.. ఆ తర్వాత అడపాదడపా చినుకులకే పరిమితమైంది. ఆశించినస్థాయిలో వానలు కురవకపోవంతో పత్తి పంటలు, వరినార్లు ఎండిపోతున్నాయి. రుతుపవనాలు ముందే వచ్చి మురిపించినా ఆ తర్వాత వర్షాభావ పరిస్థితులు రైతులను కలవరపెడుతున్నాయి. జిల్లాలోని 12 మండలాల్లో లోటువర్షపాతం నమోదుకాగా, 9 మండలాలలో సాధారణ వర్షపాతం నమోదైంది. కేవలం రెండు మండలాలలో మాత్రమే సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. జూన్, జూలై నెలల్లో కురవాల్సిన వర్షం ముందే అంటే మే నెలలో కురవడం వల్ల సాగుపై తీవ్రప్రభావం చూపుతుందని స్వయంగా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించడం గమనార్హం. రాబోయే నాలుగైదు రోజులు జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించగా రైతులు ఎదురు చూస్తున్నారు. పత్తి రైతులు మే నెలలో కురిసిన వర్షాలకు విత్తనాలు వేశారు. అనంతరం వరుణుడు మొఖం చాటేయడంతో మొలకెత్తలేదు. ఆ తర్వాత మళ్లీ విత్తారు. మొక్కలు మొలిచాక వర్షాలు లేకపోవడంతో వాడిపోతున్నాయి. దీంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారు. కాగా గురువారం రాత్రి జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం రైతులకు ఉపశమనం కలిగించింది. వడబడుతున్న పత్తి మొక్కలు, వరినారుకు ప్రాణం పోసినట్లయింది.

అత్యధికంగా జూలూరుపాడులో...

కరకగూడెం, పినపాక, దుమ్ముగూడెం, మణుగూరు, ఆళ్లపల్లి, గుండాల, ఇల్లందు, చుంచుపల్లి, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, భద్రాచలం, ములకలపల్లి మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం నమోదైన మండలాల్లో చర్ల, అశ్వాపురం, టేకులపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, సుజాతనగర్, పాల్వంచ, బూర్గంపాడు, దమ్మపేట ఉన్నాయి. జూలూరుపాడు, అశ్వారావుపేట మండలాల్లో మాత్రమే సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల్లో జూన్ 1వ తేదీ నుంచి ఈ నెల 17వ తేదీ వరకు వర్షపాతం వివరాలను పరిశీలిస్తే.. జూలూరుపాడు మండలంలో అత్యధికంగా 40.9 మి.మీ వర్షపాతం నమోదుకాగా, చర్ల మండలంలో అత్యల్పంగా 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కరకగూడెం మండలంలో 41.5 మి.మీ, పినపాక 48.4 , దుమ్ముగూడెం 38.7, అశ్వాపురం 7.3, మణుగూరు 39.2, ఆళ్లపల్లి, 27.7, గుండాల 23.5, ఇల్లెందు 36.1, టేకులపల్లి 9.6, చంద్రుగొండ 16.7, అన్నపురెడ్డిపల్లి 7.3, చుంచుపల్లి 30, సుజాతనగర్ 12.5, కొత్తగూడెం 26.8, లక్ష్మీదేవిపల్లి 28.2, పాల్వంచ 13.9, బూర్గంపాడు 1.5, భద్రాచలం 24.2, ములకలపల్లి 35.5, దమ్మపేట 17.1, అశ్వారావుపేటలో 37.7మి.మీ వర్షపాతం నమోదైంది.

వర్షాలు పడితేనే మొక్కలకు జీవం



వర్షాభావ పరిస్థితులు భయపెడుతున్నాయి. మొదట వర్షాలు కురవడంతో సంతోషపడ్డాం. పత్తి విత్తనాలు వేశాం. తర్వాత వర్షాలు పడక అవి భూమిలోనే కలిసి పోయాయి. ఆ తర్వాత కురిసిన వర్షానికి మళ్లీ పత్తి విత్తనాలు వేశాం. అవి మొలకెత్తాయి. వర్షాలు పడితేనే మొక్కలు బతుకుతాయి.

– చింతల నాగరాజు, రైతు, గరిమెళ్లపాడు

మిర్చి నారుపై గడ్డిమందు పిచికారీ

ముగ్గురు రైతులకు రూ. 2లక్షల నష్టం

టేకులపల్లి: మిర్చి నారుపై గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేయడంతో ముగ్గురు రైతులకు రూ. రెండు లక్షల నష్టం వాటిల్లింది. దీంతో న్యాయం చేయాలని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టేకులపల్లి మండలం సులానగర్ గ్రామానికి చెందిన అజ్మీర వీరన్న 70 ప్యాకెట్లు, అజ్మీర హట్యా 80 ప్యా కెట్లు, కందుకూరి రాములు 50 ప్యాకెట్ల మిర్చి విత్తనాలు కొని 15 రోజులు నాటారు. ఒక్కో ప్యాకెట్ రూ. 1000 చొప్పున ముగ్గురు కలిసి 200 ప్యాకెట్ల మిర్చి విత్తనాలను నారు కోసం చల్లారు. మొలకెత్తగా సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. గురువారం మధ్యాహ్నం వెళ్లి చూసే సరికి మిర్చి నారు మొత్తం చనిపోయి కనిపించింది. గుర్తుతెలియని వ్యక్తులు గడ్డిమందు పిచికారీ చేసినట్లు గుర్తించారు. తమకు రూ. 2 లక్షల నష్టం వాటిల్లిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యాపారిపై రైతుల ఫిర్యాదు

దుమ్ముగూడెం: పురుగుల మందు అధిక ధరకు విక్రయించిన మండల పరిధిలోని చిన్ననల్లబల్లి గ్రామానికి చెందిన ఓ ఎరువుల దుకాణ వ్యాపారిపై సుజ్ఞానపురం గ్రామానికి చెందిన రైతులు అజ్మీరా రామారావు, భూక్యా మంగ్యా పోలీస్‌స్టేషన్‌లో, మండల వ్యవసాయ అధికారికి గురువారం ఫిర్యాదు చేశారు. పత్తి చేలో పిచికారీ చేసేందుకు ఒకే మందు ఇద్దరు రైతులు కొనుగోలు చేయగా, వ్యాపారి రామారావుకు రూ.1200కు విక్రయించాడని, మంగ్యాకు రూ. 1800కు విక్రయించాడని బాధితులు ఆరోపించారు. సదరు వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.



వికసించిన బ్రహ్మకమలం

సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్‌లో ఉన్నక్వార్టర్ నంబర్ ఇ–318లో గౌరిశెట్టి రవి ఇంట్లో బ్రహ్మకమలం వికసించింది. ఒకే చెట్టుకు ఎనిమిది పూలు పూయగా, స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– సింగరేణి(కొత్తగూడెం)

తేలని పోడు పోరు..

- మాణిక్యారం – ఎర్రబోడు ప్లాంటేషన్‌లో తరచూ వివాదం
- ప్రత్యామ్నాయం చూపలేదని పోడుదారుల ఆందోళన
- అక్కడే మకాం, వంటావార్పు
- తొలగించే క్రమాన ఘర్షణలు



దేరాల వద్ద పోడుదారుల కుటుంబాలు

కారేపల్లి: ప్రత్యామ్నాయం చూపిస్తామని పోడు భూమిని లాక్కున్నారని గిరిజనులు.. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసిన ప్లాంటేషన్‌లో సాగు చేయనిచ్చేది లేదని అటవీ అధికారులు.. ఇలా ఎవరికి వారు పట్టు వీడకపోవడంతో ఘర్షణలు నిత్యకృత్యమయ్యాయి. పోడు భూమి తప్ప తమకు ఆధారం లేనందున ప్రత్నామాయం చూపించాలని, లేకపోతే ఇక్కడే సాగు చేసుకోనివ్వాలని గిరిజనులు కోరు తూ తరచుగా దున్నేందుకు సిద్ధమవుతుండడం.. అధికారులు అడ్డుకునేక్రమాన గొడవలు జరుగుతున్నాయి. అయినా గిరిజనులు మాత్రం వెనక్కి తగ్గకుండా ప్లాంటేషన్‌లోనే డేరాలు వేసుకుని వంటా వార్పుతో అక్కడే గడుపుతుండడంతో వివాదం ఏ మలుపు తిరుగుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇదీ వివాదం...

కారేపల్లి మండలం మాణిక్యారం – ఎర్రబోడు గ్రామపంచాయతీల పరిధి మాణిక్యారం, గుడితండా, కోయగుంపు, రూప్లాతండా, ఎర్రబోడు గ్రామాలకు చెందిన సుమారు 50 కుటుంబాల గిరిజన, గిరిజనేతర పోడుదారులు ఏళ్లుగా పోడు చేసుకుంటున్నారు. వీరంతా కారేపల్లి ఫారెస్టు రేంజ్ పరిధి ఊట్కూరు నార్త్ బీట్‌లో సుమారు 150 ఎకరాల్లో తాతల నాటి నుంచి పోడు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. అయితే, సుమారు 50 హెక్టార్ల పోడు భూమి స్వాధీనానికి అటవీ అధికారులు కొన్నేళ్ల క్రితం సిద్ధమయ్యారు. ఇక్కడ అటవీ ప్లాంటేషన్ ఏర్పాటు చేస్తామని చెబుతూ... పోడుదారులకు ప్రత్యామ్నాయంగా మరో చోటు భూమి చూపిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పోడుదారులు తొలుత నిరాకరించినా అధికారులు పట్టువదలకుండా పెద్దల సమక్షాన హామీ ఇవ్వడంతో 2020 సంవత్సరంలో ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు.

హామీ మరిచిన అధికారులు

ఆపై అధికారులు ప్రత్యామ్నాయ భూమి చూపించకపోగా, ఎన్నిసార్లు పోడుదారులు కలిసినా స్పందన రాలేదు. ఈమేరకు 2021లో ప్లాంటేషన్‌లోని మొక్కలను పోడుదారులు ధ్వంసం చేశారు. ఆ సమయంలో ఘర్షణ జరగగా 30మంది పోడుదారులపై కేసులు నమోదయ్యాయి. ఇందులో జాటోతు కిషన్, కాంపాటి రమేష్, భూక్యా రమేష్, రాయల మహేష్, కళమ్మ, వెంకన్న కోర్టుకు సైతం హాజరయ్యారు. ఇదే తరహాలో 2023, 2024లో కూడా పోడుదారులు ప్లాంటేషన్‌లోకి ప్రవేశించి మొక్కలు ధ్వంసం చేయడం, దున్నేందుకు యత్నించడం.. అధికారులు అడ్డుకుని కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారింది. అయినా వివాదం సద్దుమణగలేదు. ఈసారి 7వ తేదీన పోడుదారులు అరకలు కట్టి దున్నుతుండగా.. అధికారులు అడ్డుకున్నారు. అక్కడ ఘర్షణ జరగడంతో ఎఫ్‌డీఓ వెంకన్న చేరుకుని త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

దేరాలు వేసుకుని మకాం

అధికారులు హామీ ఇచ్చి వారం దాటినా ఎలాంటి స్పందన లేకపోవడంపై పోడుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు ప్లాంటేషన్ వద్దే డేరాలు వేసుకుని వంటావార్పు చేసుకుంటూ గడుపుతున్నారు. ఇక బుధవారం కూడా పోడుదారులు – ఉద్యోగుల నడుమ తారస్థాయిలో ఘర్షణ జరిగింది. సీపీఎంతో పాటు, అనుబంధ ప్రజాసంఘాలు పోడుదారులకు మద్దతు తెలుపుతూ పోడు పోరు తేల్చేదాకా ఆందోళనలు కొనసాగిస్తామని చెబుతుండడం గమనార్హం.

పోడు ఘర్షణలో 16మందిపై కేసు

కారేపల్లి: మండలంలోని మాణిక్యారం, ఎర్రబోడు పోడు ప్లాంటేషన్‌లో పోడుదారులు, అటవీ ఉద్యోగులకు బుధవారం ఘర్షణ జరగగా, అటవీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్లాంటేషన్‌లోకి అక్రమంగా ప్రవేశించి ధ్వంసం చేయడమే కాక తమ విధులకు ఆటంకం కలిగిస్తూ దాడి చేశారంటూ ఊట్కూరు ఎఫ్ఎస్ఓ శిల్ప ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోడుదారులు, సీపీఎం నాయకులు 16మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.గోపి తెలిపారు.

మాపై కేసులు పెట్టారు..



ప్రత్యామ్నాయం చూపించకపోగా మాపైనే కేసులు పెట్టారు. కేసులతో నాలుగేళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్నాం. భూమి లేక కుటుంబం వీధినపడే పరిస్థితి వచ్చింది. తాతల నుంచి సాగు చేస్తున్న భూమి లాక్కుంటే మేమెలా బతకాలి.

– భూక్యా రమేష్, పోడుదారుడు, గుడితండా

ప్లాంటేషన్ రక్షణ బాధ్యత మాది



రూ.లక్షలు వెచ్చించి మొక్కలు నాటి ఏళ్లుగా సంరక్షిస్తున్నాం. ఆ ప్లాంటేషన్‌ను కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది. పోడుదారులకు ప్రత్యామ్నాయ భూమి చూపించడంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం ఉంటుంది.

– పి.ఏప్రాప్రాదిటర్స్, ఎఫ్ఆర్ఓ, కారేపల్లి

మహిళా సంఘాల పనితీరు భేష్



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ

కొత్తగూడెంఅర్బన్: స్వయం సహాయక మహిళా సంఘాల పనితీరు భేష్ అని ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ అన్నారు. గురువారం కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో డ్వాక్రా గ్రూపు మహిళలతో ఆయన మాట్లాడారు. గ్రూపుల నిర్మాణం, పనితీరు, ఆర్థికాభివృద్ధి తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రుణాలు పొందినవారు తిరిగి చెల్లిస్తున్న తీరు ఆదర్శంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా డీఎంసీ సీహెచ్. రాజశేఖర్, ఏడీఎంసీ టి.చంద్రశేఖర్‌బాబు, టీఎంసీబి వెంకటేశ్వర్లు, సీఓపీ సరిత, అంగన్వాడీ టీచర్లు శాంతి, సుజాత, అరుణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై అట్రాసిటీ కేసు నమోదు

పాల్వంచ: ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్‌పై గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కేపీఎస్పీ రోడ్‌లో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలను కొత్తగూడేనికి చెందిన భూక్యా రాంబాబు(కరస్పాండెంట్), ప్రిన్సిపాల్ దేవభక్తిని దీప్తి భాగస్వామ్యంతో నడుపుతున్నారు. ఈ క్రమంలో రాంబాబు గతంలో రూ. 7 లక్షల నగదును దీప్తికి ఇచ్చాడు. కాగా గురువారం పాఠశాలకు మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి తమ అప్పు తీర్చాలని ప్రిన్సిపాల్‌ను అడిగారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కరస్పాండెంట్ తనకు కూడా డబ్బులు ఇవ్వాల్సి ఉందని చెప్పాడు. దీంతో దీప్తికి, రాంబాబుకు మధ్య వాగ్వాదం జరగ్గా, దీప్తి రాంబాబును కులం పేరుతో దూషించి దాడికి పాల్పడింది. బాధితుడి ఫిర్యాదుతో అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

స్త్రీనిధి రుణాల్లో గోల్‌మాల్!

సుజాతనగర్: మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో అక్రమాలు జరుగుతున్నాయి. మండలంలోని నిమ్మలగూడెం గ్రామంలో సుమారు రూ.10 లక్షల మేర స్త్రీనిధి రుణాలు పక్కదారి పట్టాయనే ఆరోపణలు వస్తున్నాయి. కొందరు సభ్యులు తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించినా అవి జమ కాలేదని పేర్కొంటున్నారు. ఇటీవల కొందరు సభ్యులు బ్యాంకు సిబ్బందిని సంప్రదించగా, వీఓఏకు చెల్లించిన నగదు రుణ ఖాతాల్లో జమ కాలేదని తేలింది. ఈ వ్యవహారంపై ప్రశ్నించగా తమకేమీ తెలియదంటూ వీఓఏ, సీసీ ఒకరిపై మరొకరు నెపం మోపుకుంటున్నారని సభ్యులు తెలిపారు.

మృతదేహానికి రీ పోస్టుమార్టం



మృతదేహాన్ని వెలికితీస్తున్న సిబ్బంది

చుంచుపల్లి: ఆంధ్రప్రదేశ్ తిరువూరులో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తూ గతేడాది అక్టోబర్‌లో మృతి చెందిన డాక్టర్ ప్రిష్కిల్లా కుమారి (62) మృతదేహానికి గురువారం వెంకటేశ్వరకాలనీలోని క్రిస్టియన్ శ్మశానవాటికలో అధికారులు, పోలీసుల సమక్షంలో తిరిగి పోస్టుమార్టం నిర్వహించారు. ప్రిష్కిల్లా కుమారి మృతిపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో తిరువూరు పోలీసులు, చుంచుపల్లి పోలీసులు, మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ బృందం పర్యవేక్షణలో రీ పోస్టుమార్టం నిర్వహించినట్లు చుంచుపల్లి తహసీల్దార్ కృష్ణ తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన నిద్ర

సూపర్‌బజార్(కొత్తగూడెం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి భారీ వర్షంలో నిరసన నిద్ర చేపట్టారు. నిరసన కార్యక్రమం తొలుత ధర్నాచౌక్‌లో నిర్వహించాలని భావించారు. అక్కడ చెట్లపొదలు, చెత్తా చెదారంతో నిండి, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో కలెక్టరేట్ మెయిన్‌గేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. వర్షంలో కూడా నిరసన కార్యక్రమం కొనసాగించారు. పోలీసులు చొరవ తీసుకుని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షకార్యదర్శులు హరీష్, ఫహీం దాదా, నాయకులు వి సతీష్, ఖయ్యూం, ఉపేందర్ పాల్గొన్నారు.



నిరసన నిద్ర చేస్తున్న నాయకులు

ఓసీ పనులు వేగవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

ఇల్లెందు: ఇల్లెందులో నూతన ఓసీ పనులు వేగవంతం చేయాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం ఆయన కేటీసీలో పర్యటించి అక్కడి బొగ్గు ఉత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓసీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. అధికారులు వీసం కృష్ణయ్య, రాధాకృష్ణ, రామస్వామి, గిరిధర్‌రావు, గోవిందరావు, నరసింహరాజు, జాకీర్ హుస్సేన్, రవికుమార్, నాగరాజు నాయక్, రామూర్తి, శివవీర కుమార్ పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

టేకులపల్లి: కత్తితో దాడి చేసిన కేసులో పోలీసులు ఇద్దరు నిందితులను గురువారం అరెస్ట్ చేశారు. టేకులపల్లి ఎస్ఐ అలకుంట రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని మూడు తండాకు చెందిన గుగులోత్ రవి ఈనెల 7న రాత్రి టేకులపల్లి లోని డాల్ఫిన్ బేకరీ వద్దకు వెళ్లాడు. అదే సమయంలో రవి తమ్ముడు (బాబాయి కుమారుడు) గుగులోత్ వినోద్ కుమార్ కూడా అక్కడికి వచ్చాడు. కొంత కాలంగా ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో వివాదం ఉండగా, మళ్లీ వాగ్వాదం నెలకొంది. దీంతో వినోద్ కుమార్ కత్తితో దాడి చేయడంతో రవికి తీవ్రగాయాలయ్యాయి. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితుడిని స్థానికులు కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు వినోద్‌కుమార్, అతనికి సహకరించిన వాంకుడోత్ ప్రవీణ్‌ను అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దు

కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



నార్కోటిక్ డాగ్‌తో సోదాలు చేస్తున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ తదితరులు

జూలూరుపాడు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. గురువారం మండలంలోని మాచినేనిపేటతండాలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు ఇంటింటికీ వెళ్లి సోదాలు నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాలను గుర్తించేందుకు జాగిలంతో తనిఖీలు చేపట్టారు. కార్డెన్ సెర్చ్‌లో రూ 4 వేల విలువైన నాటుసారా, రూ.15 వేల విలువైన మద్యం బాటిళ్లు, రూ.3,500 విలువైన గుట్కాలు స్వాధీనం చేసుకున్నారు. సరైన ధ్రువపత్రాలులేని 65 వాహనాలకు రూ.8,900లు జరిమానా విధించారు. అనంతరం మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రతాప్, 12మంది ఎస్ఐలు, 60మంది పోలీస్ సిబ్బంది కార్డెన్ సెర్చ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కరకగూడెం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం జరిగింది. మండల పరిధిలోని నీలాద్రిపేట వలస ఆదివాసీ గ్రామానికి చెందిన కుంజం శివ బైక్‌పై కరకగూడెం వచ్చి వెళ్తుండగా మోతె మూలమలుపు వద్ద చెట్టును ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలు కావడంతో 108లో కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మణుగూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇల్లెందు కోర్టు ఉద్యోగి స్వామినాథం ఆళ్లపల్లి మండలానికి బైక్‌పై వెళ్లి వస్తున్నాడు. అదే సమయంలో ఇల్లెందుకు చెందిన మహేష్ మరో బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొమరారం శివారులో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికి గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.